క్లుప్తంగా

31 వరకూ ఉచిత వైద్య సేవలు

రాజానగరం: స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న జనరల్ ఆస్పత్రిలో ఈ నెల 31 వరకు కొన్ని రకాల వ్యాధులకు ఉచిత వైద్య సేవలు అందించనున్నామని కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పిడియాట్రిక్స్, పల్మనాలజీ, ఆర్థోపెడిక్స్ విభాగాలలో ఉచిత సేవలు లభిస్తాయన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు లేనివారు కూడా వినియోగించుకోవచ్చని, అయితే వారు అవసరమైన మందులు, ఇంప్లాంట్ల ఖర్చును భరించాలన్నారు.

జూదాలు అరికట్టాలని వినతి

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో అ సాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని గ్రామ సర్పంచ్ సబ్బారపు పద్మావతి అధికారులకు వినతిపత్రం అందించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో గొడవలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో సంక్రాంతి సందర్భంగా కేవలం కోడిపందేలు, పేకాట, గుండాట, నంబర్ బోర్డులు వంటి ఆటలు జరగకుండా చూడాలన్నారు. దీనిపై పంచాయతీ తీర్మానం చేసిన కాపీని తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. కార్యక్రమంలోని ఉప సర్పంచ్ పడాల వెంకట రామారెడ్డి పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ

రంగంపేట: మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. వడిశలేరు ఎన్టీఆర్ విగ్రహం నుంచి రంగంపేటలోని ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ జరిగింది. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలన్నారు.

జూదం దుష్ప్రభావాలపై బుర్రకథ ప్రదర్శన

కపిలేశ్వరపురం: మానవ జీవితంలో జూద క్రీడల ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం వల్లూరు పంచాయతీ పరిధిలో బుర్రకథను ప్రదర్శించారు. జూదం వద్దు- సంప్రదాయ క్రీడలు ముద్దు అనే నినాదంతో కళాకారుల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. సంక్రాంతి పండగను మద్యం, పేకాట, గుండాట, కోడి పందేలు తదితర జూద క్రీడలకు దూరంగా ఉంటూ జరుపుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసి మీనాకుమారి, కార్యదర్శి సుభాకర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు

సీతానగరం: వంగలపూడి కల్లూరి రామకృష్ణ పరమహంస జిల్లా పరిషత్ హైస్కూల్లో 2008లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శుక్రవారం గ్రామంలోని మామిడి తోటలో కలుసుకున్నారు. ఆట పాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఓలేటి సతీష్, తిర్నాతి అరవింద్, యేరుకొండ వినోద్, బొల్లిన మానస తదితరులు అప్పటి తీపి గుర్తులను తెలియపర్చుతూ నవ్వులు పండించారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.

పాలకమండలి సభ్యుడిగా షేక్ మీరా

రాజానగరం: ఆలిండియా అసోసియేషన్ ఆఫ్ స్పెషల్ లైబ్రేరియన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెంటర్స్ జోన్-1కి ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్నాటక, పాండిచ్చేరి, లక్షదీప్‌ల నుంచి పాలకమండలి సభ్యుడిగా గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ లైబ్రేరియన్ షేక్ మీరాను ఎంపిక చేశారు. ఆయన 2025 వరకు ఈ పదవిలో కొనసాగుతారు.

ముగ్గుల పోటీలు

సీతానగరం: సంక్రాంతి సందర్భంగా స్థానిక శివాలయం ప్రాంగణంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అర్చకుడు కొడమంచిలి రాముస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా రఘుదేవపురానికి చెందిన రమా నర్సింగ్‌హోమ్ డాక్టర్ సి.శశికళ, ఉపాధ్యాయురాలు దుర్గ వ్యవహరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీలో పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యం రమేష్ బాబు పాల్గొన్నారు.

సేవలు స్ఫూర్తిదాయకం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి సొసైటీ (పీఏసీఎస్) సేవా కార్యక్రమాలకు స్ఫూర్తిగా నిలిచిందని వ్యవసాయ సలహామండలి చైర్మన్ త్రోవ్విడి సత్రాజు అన్నారు. శుక్రవారం సొసైటీ చైర్మన్ బుడ్డిగ సత్తిబాబు, సీఈఓ ఈదల సుదర్శనరావు ఆధ్వర్యంలో కళ్లజోళ్ల పంపిణీ జరిగింది.

ముఖ్యఅతిథిగా హాజరైన సత్రాజు చేతుల మీదుగా 90 మందికి కళ్లజోళ్లు అందజేశారు. ఇటీవల ఏలూరుకు చెందిన ఆశ్రమ హాస్పటల్ ఆధ్వర్యంలో కంటి శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రోత్సాహంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అవసరమైన 11 మందికి శస్త్ర చికిత్స, మరికొందరికి మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కంటే సత్తిబాబు, ఏపీఎస్ఎన్ మూర్తి, మేకా నెహ్రూరాజు పాల్గొన్నారు.

ముగ్గుల ముంగిళ్లు... ఘుమఘుమల లోగిళ్లు

- పల్లెల్లో సంక్రాంతి సందడి
- స్వగ్రామాలకు చేరుకుంటున్న కుటుంబాలు
- వినియోగదారులతో దుకాణాలు కిటకిట

అనపర్తి: ప్రాచీన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పెద్ద పండగ సంక్రాంతి. భారీ చుక్కల ముగ్గులు, ముగ్గుల్లో పసుపు కుంకుమలు, వివిధ రకాల పువ్వులతో సుందరంగా అలంకరించిన గొబ్బెమ్మలు, డూడూ బసవన్నలు, హరిదాసు కీర్తనలు, పిండివంటల ఘుమఘుమలు, ఇల్లంతా బంధువుల సందడి...ఇవే సంక్రాంతికి ప్రతీకలు...ఆ పెద్ద పండగ రానే వచ్చింది. ఉత్తరాయణ పర్వదినాల్లో సూర్యుడు మకర రాశిలోకి సంక్రమణం చేసే పర్వదినాన్ని మకర సంక్రాంతి గాను, దాని ముందు రోజు భోగి, సంక్రాంతి తరువాత వచ్చే రెండు రోజులు కనుమ, ముక్కనుమలుగా నాలుగు రోజులు ప్రజలు వేడుకగా జరుపుకోవడం ఆనవాయితీ. సంక్రాంతి సందడితో గ్రామాల్లో ఎక్కడ చూసినా ఆహ్లాదకర వాతావరణమే దర్శనమిస్తోంది. ఉద్యోగ, వ్యాపారాల రీత్యా పొరుగు రాష్ట్రాల్లో, వివిధ గ్రామాల్లో స్థిరపడిన


మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధం చేసిన భోగి పిడకలు

వారు తమ పిల్లాపాపలతో, కుటుంబ సభ్యులతో కలిసి సొంతూళ్లకు బయలుదేరడంతో బస్సులు, రైళ్లు, వాహనాలు జనాలతో కిటకిటలాడుతున్నాయి. దీంతో పండగ కోలాహలంతో గ్రామాల్లో సందడి నెలకొంది. సంక్రాంతిని పురస్కరించుకుని మహిళలు వేస్తున్న ముగ్గులతో ముంగిళ్లు ముచ్చట గొలుపుతున్నాయి. రంగురంగుల రంగవల్లులతో గ్రామాలు కళకళలాడుతున్నాయి.

పోటాపోటీగా భోగి మంటలు

భోగి మంటల్లోని సమిధల్లా మానవుని జీవితం క్షణభంగురమని, శారీరక ఆనందం కోసం వెంపర్లాడక, దేహ భ్రాంతిని పోగొట్టే పరమార్థాన్ని బోధించడమే భోగిమంటల ఉద్దేశమని పెద్దలు చెబుతారు. అందుకే ఇప్పటికీ పల్లె సీమల్లో ప్రధాన కూడళ్ల వద్ద భారీ స్థాయిలో భోగి మంటలు ఏర్పాటు చేసేందుకు యువత పోటీపడుతున్నారు. గ్రామ పొలిమేరల్లో పెద్ద పెద్ద చెట్ల కొమ్మలు, మానులు సేకరించి గ్రామాల్లో ప్రధాన వీధుల్లో పోగు చేశారు. భోగి మంటలు ఏర్పాటు చేసే ప్రాంతంలో రంగురంగుల జెండాలను కట్టేందుకు, మంటల ఏర్పాటుకు దుంగలు


సంక్రాంతి సందర్భంగా మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన చెరకు గెడలు

తరలించే పనిలో చిన్నా, పెద్దా బిజీబిజీగా ఉన్నారు. మరో పక్క పిల్లలు ఆవు పేడతో చేసిన భోగి పిడకలను సేకరించే పనిలో ఉన్నారు. మరికొందరు మార్కెట్‌లో దొరికే భోగి పిడకలను కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో చిన్నపాటి భోగి దండ రూ.50 నుంచి రూ.70 వరకు అమ్ముతున్నారు.

ఎక్కడ చూసినా పండగ సందడే...

సంక్రాంతి నేపథ్యంలో వ్యాపార సముదాయాలన్నీ సందడిగా మారాయి. వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పండగ వస్తోందంటే చాలు మహిళలు అందంగా అలంకరించుకుని సంప్రదాయ దుస్తులు ధరించటం పరిపాటి. పండగలో ప్రాధాన్యం సంతరించుకున్న గాజులు, ఇతర అలంకరణ సామగ్రిని కొనుగోలు చేసేందుకు వచ్చే మహిళలతో ఫ్యాన్సీ దుకాణాలు బిజీగా వున్నాయి. వారంరోజులుగా అనపర్తి మార్కెట్ ప్రాంతం కొనుగోలుదారులతో సందడిగా ఉంది.

హరిదాసులు..డూడూ బసవన్నలు...

గ్రామాల్లో హరిదాసులు, డూడూ బసవన్నల సందడితో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. హరిదాసులు హరినామ కీర్తనలతో ప్రతి ఇంటికి తిరుగుతుండగా, బసవన్నలు తమ విన్యాసాలతో అబ్బురపరుస్తున్నాయి.

పీహెచ్‌సీలను సందర్శించిన జిల్లా వైద్యాధికారి


వైద్య ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

కె.పెదపూడి: మండలంలోని కాండ్రేగుల, సంపర పీహెచ్‌సీలను జిల్లా వైద్యాధికారి ఎం.శాంతి ప్రభ, జిల్లా మలేరియా అధికారి ఎస్.భాస్కరరావు శుక్రవారం సందర్శించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. బాలింతల ఇళ్లను సందర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీల సేవలపై ఆయా వైద్యాధికారులను ఆరా తీశారు. మెరుగైన సేవలందించేందుకు పలు సూచనలు చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ కేవీవీ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల వెంకటరమణ, సంపర పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్ ప్రదీప్, సూపర్‌వైజర్ టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా జగన్ పాలన

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- మునగాలలో గడప గడపకూ

మధురపూడి: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగుతోందని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మునగాల గ్రామంలో ఐదో రోజు శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్త మునగాల రామాలయం వీధి నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో తొలుత శ్రీరామచంద్రమూర్తిని దర్శించుకున్నారు. గ్రామంలోని గడప గడపకూ తిరుగుతూ వారికందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. గ్రామంలోని 200 గడపలు తిరిగారు.

గ్రామంలో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ గ్రామానికి ప్రభుత్వం మూడేళ్ల కాలంలో రూ.7 కోట్లు నిధులు కేటాయించిందన్నారు. దానిలో భాగంగానే అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. గ్రామంలో నాడు-నేడు పథకంతో పాఠశాల అభివృద్ధి, సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్, మంచినీటి ట్యాంకు, శ్మశాన వాటిక అభివృద్ధి


మునగాలలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

తదితర పనులు నిర్వహించామన్నారు. స్థానికులు చెప్పిన ఇళ్ల స్థలాలు, తాగునీరు, సాగునీరు సమస్యలను పరిష్కరిస్తానన్నారు. రబీ పంటకు బురద కాలువ నీరివ్వాలన్న రైతన్నల కోరిక మేరకు సాగునీటి శాఖ డీఈతో ఫోన్‌లో మాట్లాడి నీరందించాలని ఆదేశించారు. అలాగే జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు త్వరలో ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, మునగాల ఎంపీటీసీ సభ్యుడు చింతాకుల లోవరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు గిద్దా సత్యనారాయణ, మండపాక కోటేశ్వరరావు, వెంకటపతి, సీతారాముడు, నాగులాపల్లి పెద్ద వెంకన్న, ఫణికుమార్ పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: అర్హులైన పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తి శివారు కొత్తూరులో వైఎస్సార్ జగనన్న కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుద్దీకరణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాలు, పేదలందరికీ ఇల్లు పథకం ద్వారా దేశంలో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టారన్నారు. నూతన గృహాలతో పల్లెలు సరికొత్త శోభను సంతరించుకుంటున్నాయని అన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించిన ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని తెలిపారు. దీనిలో భాగంగా కొత్తూరులో సుమారు రూ.2 కోట్లతో విద్యుద్దీకరణ పనులు చేపట్టినట్లు చెప్పారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు సర్వీసు చార్జీలు లేకుండా విద్యుత్ కనెక్షన్‌తోపాటు విద్యుత్ మీటరు ఏర్పాటు చేసే బోర్డు, కరెంటు స్తంభం నుంచి మీటర్ బోర్డు వరకు విద్యుత్ వైరు కూడా ఉచితంగా ఇచ్చి పేదల గూటికి


విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

ఉచిత వెలుగులు అందిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. కొత్తూరు జగనన్న కాలనీలో విద్యుద్దీకరణ పనులకు సహకరించి పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషిచేసిన విద్యుత్‌శాఖ అధికారులను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ సత్తి గంగిరెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి, రామచంద్రపురం ఈఈ డి.శ్రీధర్‌వర్మ, ఈఈ కన్‌స్ట్రక్షన్స్ వై.డేవిడ్, ఏడీఈ పి.సన్యాసిరావు, ఏఈ వి.వీరభద్రరావు, ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, వార్డు సభ్యుడు సుమన్, వైఎస్సార్ సీపీ నాయకులు చింతా సుబ్బారెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, సత్తి సత్తిరెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

మండలంలోని కుతుకులూరులో ఏర్పాటు చేసిన శ్రీ భక్తాంజనేయ ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ నెల 18వ తేదీ వరకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. పోటీలో విజేత జట్టుకు రూ.25 వేలు, రన్నర్ జట్టుకు రూ.15 వేల నగదు బహుమతి, షీల్డ్, ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు వ్యక్తిగత బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ గొల్లు హేమతులసి సురేష్, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సత్తి దొరయ్యరెడ్డి, ఉపసర్పంచ్ సబ్బెళ్ల నాగిరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు కొవ్వూరి సత్యనారాయణ రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పడాల హరిసాయి కృష్ణారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ నల్లమిల్లి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో మాధవరావు

సీతానగరం: రైతు సమస్యల పరిష్కారమే వ్యవసాయ సలహా మండలి లక్ష్యమని జిల్లా వ్యవసాయశాఖాధికారి పి.మాధవరావు అన్నారు. సీతానగరం వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏవో కె.సూర్య రమేష్ అధ్యక్షతన శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఏవో మాధవరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం మండల వ్యవసాయ మండలిలో చర్చించి, తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్థికపరమైన, పంటల సాగు విధానం, గిట్టుబాటు ధర తదితర సమస్యలను పరిష్కరించడానికి అవకాశం ఉందన్నారు. జిల్లాలో 12 వేల హెక్టార్ల విస్తీర్ణంలో మొక్కజొన్నను పండించారని, విత్తనాల కోసం రైతులతో కంపెనీలు ఒప్పందం చేసుకుని, వారి మధ్య అవగాహన ద్వారా ముందుకువెళుతున్నారన్నారు. ఎంఓడీ ప్రకారం జరగకపోతే కంపెనీపై చీటింగ్ కేసు పెట్టుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం పెంచడానికి ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో డీడీ బోస్, ఏడీఏ మల్లికార్జునరావు, తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు, హార్టికల్చర్ ఏవో తులసి, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.


వీరుళ్లమ్మ జాతరకు రారండోయ్...

18వ తేదీ వరకు నిర్వహణ

అనపర్తి: అనపర్తి అంటే గుర్తుకు వచ్చేది ఈ ఊరు గ్రామ దేవత శ్రీ వీరుళ్లమ్మ అమ్మవారు. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి అనపర్తి మెయిన్ రోడ్డులో కొలువుతీరిన శ్రీ వీరుళ్లమ్మ వారు జాతరకు ముస్తాబైంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ జాతర, తీర్థాన్ని ప్రతీ సంవత్సరం భోగి పండగ నుంచి ఐదు రోజులపాటు నిర్వహించటం ఆనవాయితీ. దీనిలో భాగంగా ఈనెల 14వ తేదీ శనివారం నుంచి 18వ తేదీ వరకు జరగనుంది. దీనికి సంబంధించి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని, ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఒడిశా, కర్ణాటక రాష్ట్రాలతో పాటు వైజాగ్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు.

ఏర్పాట్లు పూర్తి

వీరుళ్ళమ్మ వారి జాతరకు కమిటీ సభ్యులు


అనపర్తి మెయిన్‌రోడ్డులో విద్యుత్ కాంతులు

ఏర్పాట్లు పూర్తి చేశారు. 14న భోగి పండగను పురస్కరించుకుని అమ్మవారు స్వర్ణాభరణాలతో భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం 9 గంటల నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 15వ తేదీ సంక్రాంతి రోజు రాత్రి అమ్మవారి జాతర సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా పోటీలు ఏర్పాటు చేశారు. అమ్మవారి జాతరలో గారడీ విద్యలు, నవదుర్గలు, కాళికా వేషాలు, చైనా బొమ్మలు, పులివేషాలు, శివకాళీ నృత్యం, మ్యూజికల్ బ్యాండ్, తీన్‌మార్ డప్పులు, గరగలు కోయ, నెమలి డ్యాన్సులు ఏర్పాటు చేశారు. 16, 17, 18 తేదీల్లో అమ్మవారి తీర్థం జరుగుతుంది. 18న అన్నదానం నిర్వహించనున్నారు. జాతర సందర్భంగా హైదారాబాద్ వారి ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు.

కాంతులీనుతున్న గ్రామం

అమ్మవారి జాతర సందర్భంగా విశాఖజిల్లా నర్సీపట్నం జంగాలపల్లికి చెందిన రాజా లైటింగ్, డెకరేషన్‌లు అబ్బుర పరుస్తున్నాయి. స్థానిక దేవీచౌక్ నుంచి రైల్వేస్టేషన్ వరకు, మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రధాన వీధుల్లో వివిధ దేవతామూర్తుల ఆకృతుల్లో విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద సుమారు 80 అడుగుల ఎత్తులో అయోధ్య రామమందిరం, వెనుక వైపు ఆర్ఆర్ఆర్ సినిమాకు సంబంధించిన సన్నివేశాలతో కూడిన విద్యుత్ వెలుగుల్లో గ్రామం కాంతులీనుతోంది.

'సంక్షేమం'పై జనం సంతృప్తి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తి గ్రామ సచివాలయం-5 పరిధిలో గడప గడపకూ

అనపర్తి: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలుపై ప్రజలు వంద శాతం సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తి గ్రామ సచివాలయం-5 పరిధిలో గల చిన పాలమూరు, సావారం ప్రాంతాల్లో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఆయా కుంటుంబాలకు కలిగిన లబ్ధిని, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా తమ ముంగిటకు విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆయా ప్రాంత ప్రజలు స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులు పట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

మాట ఇచ్చాం...హామీలు అమలు చేశాం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేసిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి పారదర్శక పాలనతో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. సిఫారసులు, దళారుల ప్రమేయం, లంచాలు లేకుండా సంక్షేమ పథకాల


సంక్షేమ పథకాల లబ్ధిదారుకు కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

ద్వారా లబ్ధిదారులకు మంజూరైన సొమ్ము వారి బ్యాంకు ఖాతాలకే నేరుగా జమ చేస్తున్నారని అన్నారు. ఇచ్చిన ప్రతి మాటను నెరవేర్చడంతో ప్రజల ముందుకు ధైర్యంగా వస్తున్నామని తెలిపారు. పాలనలో నూతన ఒరవడికి నాంది పలికిన సీఎం జగన్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీలు పులగం బుల్లిరెడ్డి, కర్రి దాసు, ఎంపీటీసీ సభ్యురాలు అంసూరి పద్మావతి, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వార్డు సభ్యుడు వాసంశెట్టి కోటేశ్వరరావు, పొలమూరు ఉపసర్పంచ్ సత్తి సూరారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మల్లిడి విజయ్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి సచివాలయం పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు శుక్రవారం స్థానిక పీఏసీఎస్ చైర్మన్ బుడ్డిగ సత్తిబాబు, సెక్రటరీ తాతపూడి జాకబ్ రాజు దుస్తులు పంపిణీ చేశారు. పంచాయతీ పరిధిలోని నలుగురు కార్మికులు పనిచేస్తున్నారు. కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చెంపేటలో విషాదఛాయలు


దోకుబుర్ర సుభాష్

మధురపూడి: కోరుకొండ మండలం బుచ్చెంపేటకు చెందిన పదో తరగతి విద్యార్థి దోకుబుర్ర సుభాష్(15) మృతితో శుక్రవారం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాలుడి అంత్యక్రియలు శుక్రవారం గ్రామంలో నిర్వహించారు. కోరుకొండలోని చెరుకూరి విద్యాలయంలో చదువుతున్న సుభాష్ తోటి విద్యార్థులతో కలసి గురువారం విహారయాత్రకు వెళ్లాడు. అడ్డతీగల మండలం పైడిపుట్ట వద్దగల కన్నేరు వాగులో స్నానానికి దిగాడు. జారుడు రాళ్లున్న ఆ వాగులో మునిగిపోతున్న మరో విద్యార్థిని కాపాడబోయి మృతి చెందాడు. దోకుబుర్ర వీర్రాజు, ఆనందిని దంపతులకు సుభాష్‌తో పాటు కుమార్తె సుశాంతి (ఇంటర్) ఉన్నారు. వీర్రాజు గోకవరం మండలం కామరాజుపేట హైస్కూల్లో హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. కుమారుడి మృతితో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

బిక్కవోలు: చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్‌శాఖ అడిషనల్ ఎస్పీ పిట్టా సోమశేఖర్ అన్నారు. శుక్రవారం రంగాపురంలో సారా నిర్మూలన భాగంగా ఆపరేషన్ పరివర్తన 2.0 కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సారా విషయంలో రంగాపురం రెడ్‌జోన్‌లో ఉందన్నారు. దీన్ని గ్రీన్‌జోన్‌లోకి మార్చడానికి గ్రామస్తుల సహకరించాలన్నారు. ఎక్సైజ్ సీఐ వెంకటలక్ష్మి, అనపర్తి సీఐ శ్రీనివాస్, ఎస్ఐ పి.బుజ్జిబాబు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

పెదపూడి: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. పెద్దాడలో క్రైస్త వ ఉజ్జీవ సువార్త మహాసభలు పాస్టర్ పీటర్ ఆధ్వర్యా న నాలుగు రోజులుగా జరుగుతున్నాయి. ఈ సభలకు ముఖ్య అతిథులుగా మంత్రి తానేటి వనిత, అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదలందరూ సంతోషంగా ఉండాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యోచిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, కరుణ, జాలి, ప్రేమ వంటి క్రీస్తు బోధలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యేను పాస్టర్ పీటర్, ఆయ న కుటుంబ సభ్యులు సత్కరించారు. ఆమె కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, సర్పంచ్ డొకుబుర్ర మీనాక్షి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ


క్రైస్తవ మహాసభలో మాట్లాడుతున్న హోంమినిస్టర్ వనిత

నాయకుడు డొకుబుర్ర కృష్ణ, బీసీ సెల్ పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ కేతా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు గోదాదేవి, వేంకటేశ్వరస్వామి కల్యాణం

పెదపూడి: మండలంలోని పెద్దాడ గ్రామంలో వేంచేసియున్న శ్రీ గోదాదేవి శ్రీ అభినవ వేంకటేశ్వర స్వామి వార్లకు శనివారం కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ ప్రతినిధులు తెలిపారు. భోగి మహాపర్వదినం రోజు సాయంత్రం 6 నుంచి కల్యాణ మహోత్సవం వైఖానస ఆగమ మోక్త ప్రకారం కన్నుల పండువగా జరిపించనున్నట్టు తెలిపారు.

నేడు గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం

మధురపూడి: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అనుబంధ దేవాలయమైన రంగనాథస్వామి ఆలయంలో శనివారం గోదాదేవి, రంగనాథస్వామి వారి తిరుకల్యాణ మహోత్సవం జరుగుతోంది. ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్పీ రంగరాజ భట్టర్, కార్యనిర్వాహణాధికారి వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో 28 రోజులుగా ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు జరుగుతున్నాయి. పాణిగంపల్లి పవన్‌కుమారాచార్యులు కల్యాణం నిర్వహించనున్నారు. ఈనెల 15, 16వ తేదీల్లో గ్రామోత్సవాలు జరుగుతాయి.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

ప్రకాశం నగర్: గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు, రాజమహేంద్రి మహిళా కళాశాలల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాజమహేంద్రవరం మున్సిపల్ కాలనీ మైదానంలో జరిగిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ముగ్గుల పోటీలు, ఎడ్లబళ్ల ప్రదర్శన, గుర్రప్పు స్వారీ, కోడిపందేల నమూనా బరి, హరిదాసుల సంకీర్తనలు, కొమ్ముదాసు పాటలు, సోది వంటి కార్యక్రమాలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, తృతీయ బహుమతిగా రూ.2వేలు అందజేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు చీర పంపిణీ చేశారు. అనసూరి శ్రీనివాస్, పద్మలత, బర్రే కొండబాబు, కానుబోయిన సాగర్, పినిశెట్టి సుబ్బరాజు, జీవీ రెడ్డి పాల్గొన్నారు.

సంప్రదాయాలు భావితరాలకు చేరాలి

బిక్కవోలు: తెలుగువారి సంస్కృతి, సంప్రదా


ఎడ్లబండిపై సవారీ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, టీకే విశ్వేశ్వరరెడ్డి

యాలు భావితరాలకు తెలిసేలా చేయాలని ఎస్ఐ పి.బుజ్జిబాబు అన్నారు. శుక్రవారం బిక్కవోలు పోలీస్‌స్టేషన్ వద్ద నిర్వహించిన సంప్రదాయాల సంక్రాంతి కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం పోలీస్‌స్టేషన్ వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటరెడ్డి పాల్గొన్నారు.